## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 11-12-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- భారతదేశానికి మణిపూర్ ఎంతో స్ఫూర్తిని ఇస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- రాజ్యసభలో వందేమాతరంపై చేపట్టిన చర్చ ఈరోజుతో ముగిసింది.
- ఇటలీతో ఆర్థిక పారిశ్రామిక భాగస్వామ్యాన్ని మరింతగా పెంచుకుంటామని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ స్పష్టం చేశారు.
- పెట్రోల్ తో ఇథనాల్ కలపడం వల్ల ఆదా అయ్యే మొత్తాన్ని రైతుల కోసం వెచ్చిస్తున్నామని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి తెలిపారు.
- భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య ముల్లాన్ పూర్ వేదికగా టి-20 క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = =

మణిపూర్ ప్రజలు ప్రతిభావంతులని, కష్టపడి పనిచేసేవారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఆ రాష్ట్ర పర్యటనలో భాగంగా ఇంఫాల్ లో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలలో రాష్ట్రపతి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ, మణిపూర్ భారత దేశానికి ఎంతో స్ఫూర్తిని ఇస్తోందని అన్నారు. మణిపూర్ ప్రజల ధైర్యంతో పాటు అసాధారణమైన సాంస్కృతిక సంపద మణిపూర్ ప్రజల సొంతమని చెప్పారు. తరతరాలుగా స్థానిక ప్రజలు.. క్రీడలు, సాయుధ దళాలు, కళలు, సంస్కృతి, ప్రజా సేవతో సహా వివిధ రంగాలకు అపారమైన సహకారం అందించి భారతదేశాన్ని సుసంపన్నం చేశారని కొనియాడారు. ఇటీవల కాలంలో మణిపూర్ ప్రజలు అనుభవించిన బాధ గురించి తనకు తెలుసని రాష్ట్రపతి అన్నారు. మణిపూర్ ప్రజలకు అండగా కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ ఉంటుందని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్…24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

యునెస్కో అవ్యక్త సాంస్కృతిక వారసత్వ జాబితాలో దీపావళి పండుగను చేర్చడం పట్ల రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశానికి గర్వకారణమైన విషయమన్నారు. దీపావళి కేవలం పండుగ మాత్రమే కాదని, చీకటిపై వెలుగు సాధించిన విజయాన్ని సూచిస్తుందని ఆయన గుర్తు చేశారు. యునెస్కో తీసుకున్న ఈ నిర్ణయం దేశం యొక్క గొప్ప వారసత్వం, సంప్రదాయాలను ప్రోత్సహించడానికి ప్రజలను ప్రేరేపిస్తుందని సీపీ రాధాకృష్ణన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

ఇటలీతో ఆర్థిక పారిశ్రామిక భాగస్వామ్యాన్ని మరింతగా పెంచుకోవడంలో భారతదేశం పూర్తి నిబద్ధతతో ఉందని కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖా మంత్రి పియూష్ గోయల్ స్పష్టం చేశారు. ముంబైలో ఈరోజు జరిగిన ఇండియా-ఇటలీ బిజినెస్ ఫోరం ప్లీనరీ సమావేశంలో ఇటలీ ఉప ప్రధాని, విదేశాంగ సహకార మంత్రి ఆంటోనియో

టజానితో కలిసి ప్రసంగిస్తూ పియూష్ గోయల్ ఈ విషయం చెప్పారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కొనసాగించడానికి భారతదేశం సిద్ధంగా ఉందని అన్నారు. రెండు దేశాల ఉమ్మడి అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో ఇటలీతో భారతదేశ భాగస్వామ్యం కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, సాంకేతికత ఆవిష్కరణ, క్రీడలు, రక్షణ, అంతరిక్షం, వస్త్రాలు, వ్యవసాయం, ఆహార ప్రాసెసింగ్ వంటి రంగాలలో ఇటలీతో కలిసి పనిచేయడానికి భారత్ ఆసక్తిగా ఉందని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్…29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

రాజ్యసభలో జాతీయ గేయం వందేమాతరం 150వ వార్షికోత్సవంపై చర్చను తిరిగి ఈరోజు చేపట్టారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం వందేమాతరంపై చర్చను ప్రారంభించగా, చర్చను ముగిస్తూ, రాజ్యసభలో సభా నాయకుడు కేంద్ర మంత్రి జె.పి. నడ్డా మాట్లాడుతూ, వందేమాతరం దేశ ఆత్మను మేల్కొలిపే ఒక మంత్రంగా అభివర్ణించారు. దేశాన్ని ఐక్యతతో ముందుకు తీసుకెళ్లడానికి ఒక సాధనంగా పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో జరిగిన అనేక చారిత్రక సంఘటనలకు ఈ గీతం సాక్ష్యంగా నిలిచిందని కేంద్రమంత్రి అన్నారు. గత రెండు రోజులుగా రాజ్యసభలోని 80 మందికి పైగా సభ్యులు వందేమాతరంపై చర్చలో పాల్గొన్నారని ఆయన చెప్పారు. ఇంతటి విస్తృతమైన చర్చ జరగడం ద్వారా ఈ అంశం ఎంతటి ప్రాముఖ్యత కలిగి ఉందో తెలియజేస్తోందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

రైల్వే టిక్కెట్ల రిజర్వేషన్ కోసం ఉపయోగించే మూడు కోట్లకు పైగా అనుమానాస్పద యూజర్ ఐడి ఖాతాలను ఈ ఏడాది జనవరి నుంచి నిలిపివేశామని రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ లోక్ సభకు ఈరోజు తెలిపారు. భారతీయ రైల్వే రిజర్వేషన్ టికెట్ బుకింగ్ వ్యవస్థ అత్యాధునిక సైబర్ భద్రతా నియంత్రణలో ఉందని ఆయన స్పష్టం చేశారు. అలాగే రిజర్వేషన్ వ్యవస్థ పనితీరును సమీక్షిస్తూనే సాధారణ తత్కాల్ టిక్కెట్ల లభ్యతను పెంచడానికి భారత రైల్వే శాఖ అనేక చర్యలు తీసుకుందని కేంద్ర మంత్రి వెల్లడించారు. దుర్వినియోగాన్ని అరికట్టడానికి ఆన్‌లైన్ తత్కాల్ టికెట్ బుకింగ్ కోసం ఆధార్ ఆధారిత OTP ధృవీకరణను దశలవారీగా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కొత్త వ్యవస్థ ఇప్పటికే 322 రైళ్లలో పనిచేస్తోందని, దీని కారణంగా ఆయా రైళ్లలో తత్కాల్ టికెట్ లభ్యత సమయం దాదాపు 65 శాతం పెరిగిందని అశ్విని వైష్ణవ్ చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

పెట్రోల్ తో, ఇథనాల్ కలపడం వలన ఆదా అయ్యే మొత్తాన్ని రైతుల సంక్షేమం కోసం వెచ్చిస్తున్నామని కేంద్ర పెట్రోలియం శాఖా మంత్రి హర్దీప్ సింగ్ పూరి తెలిపారు. ఇంతకు ముందు ముడి చమురు దిగుమతులపై ఖర్చు చేసిన నిధులను ఇప్పుడు రైతులకు అందిస్తున్నామన్నారు. లోక్ సభలో కేంద్రమంత్రి ఈరోజు మాట్లాడుతూ, పెట్రోల్ కి అవసరం అయిన ఇథనాల్ అందించడం ద్వారా అన్నదాతలు దేశ ఇంధన శక్తి దాతలుగా కూడా మారారని హర్దీప్ సింగ్ పూరి పేర్కొంటూ...

(వాయిస్…23 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలో ఇండిగో విమానయాన సంస్థ కార్యకలాపాలకు అంతరాయం వల్ల ఇబ్బంది పడిన ప్రయాణికులకు ఆ సంస్థ పరిహారాన్ని ప్రకటించింది. ఈ నెల 3, 4, 5 తేదీలలో ఇండిగో విమానాల అంతరాయంతో ప్రయాణీకులు సమస్యలు ఎదుర్కొన్నారు. దీంతో ఒక్కో ప్రయాణికునికీ సంస్థ తరఫున పరిహారాన్ని ట్రావెల్ వౌచర్ల రూపంలో అందిస్తామని, వీటిని రాబోయే 12 నెలల్లో ఇండిగోలో చేసే ఏ ప్రయాణానికైనా ఉపయోగించుకోవచ్చని ఆ సంస్థ తెలిపింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తప్పనిసరిగా చెల్లించాల్సిన పరిహారంతో పాటు, విమానం బయలుదేరడానికి 24 గంటల ముందు రద్దు చేయబడిన విమానాల ప్రయాణికులకు, విమాన ప్రయాణ సమయాన్ని బట్టి ఇండిగో అదనంగా 5 వేల రూపాయల నుండి 10 వేల రూపాయల వరకు చెల్లిస్తుందని ఇండిగో విమానయాన సంస్థ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = =

దేశ వ్యాప్తంగా మొత్తం 4 కోట్ల 93 లక్షల స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశామని కేంద్ర విద్యుత్ శాఖా మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తెలిపారు. లోక్‌సభలో ఈరోజు ఒక ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానమిస్తూ.. ఈ మొత్తం స్మార్ట్ మీటర్లలో కోటి 60 లక్షల స్మార్ట్ మీటర్లు ప్రీపెయిడ్ విధానంలో పనిచేస్తున్నాయని వెల్లడించారు. దేశంలో ఇప్పటివరకు 20 కోట్లకు పైగా స్మార్ట్ మీటర్లు మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు. వాటిలో సుమారు నాలుగు కోట్ల స్మార్ట్ మీటర్లను ఇప్పటికే ఏర్పాటు చేసినట్లు మనోహర్ లాల్ ఖట్టర్ చెప్పారు. ప్రభుత్వ సంస్థలు, వాణిజ్య, పారిశ్రామిక సంస్థలతో పాటు అధిక విద్యుత్ ను వినియోగించే గృహ వినియోగదారుల కోసం ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని కేంద్రమంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = =

విదేశాలలో ఉన్న భారతీయ పౌరుల నుండి ఈ సంవత్సరం 16 వేలకు పైగా ఫిర్యాదులు అందాయని విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ తెలిపారు. రాజ్యసభలో ఈరోజు ఒక ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో కేంద్ర మంత్రి ఈ విషయం తెలిపారు. ఈ ఫిర్యాదులలో అత్యధికంగా 3 వేలకు పైగా సౌదీ అరేబియా నుండి వచ్చాయని, ఆ తర్వాత యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుండి 1500 పైగా ఉన్నాయని, మలేషియా నుండి 662 అమెరికా నుండి 620 ఫిర్యాదులు అందినట్లు కేంద్ర మంత్రి సభకు తెలిపారు. ఇదిలా ఉండగా, విదేశాలలో ఉన్న భారతీయ కార్మికుల భద్రత, రక్షణ సంక్షేమానికి భారతదేశం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. కార్మికులతో సహా భారతీయ పౌరుల నుండి ఏదైనా ఫిర్యాదు లేదా సమస్య అందినప్పుడు, భారత రాయబార కార్యాలయం వేగంగా సంబంధిత విదేశీ సంస్థలతో సంప్రదిస్తుందని ఆయన చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = =

భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య ముల్లాన్ పూర్ వేదికగా టి-20 క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా 18 ఓవర్లు పూర్తయ్యేసరికి 4 వికెట్లు నష్టపోయి, 185 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికా బ్యాట్స్ మన్ క్వింటన్ డికాక్ 90 పరుగులు చేయగా, భారత్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి 2 వికెట్లు తీసాడు.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =